
www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 9 నవంబర్ 2022





ఆదర్శ హరిత నగరంగా తీర్చిదిద్దుతాం..!

నెల్లూరు :ప్రభుత్వం పతిష్ఠాంగా నిర్వహిస్తున్న 'జగనన్న హరిత నగరాలు' కార్యక్రమంలో భాగంగా నగర వ్యాప్తంగా మొక్కలు నాటి, వాటి సంరక్షణతో ఆదర్శ హరిత నగరంగా తీర్చిదిద్దుదామని కార్పొరేషన్ మేయర్ పొట్లూరి స్రవంతి జయవర్ధన్ ఆకాంక్షించారు. మంగళవారం స్థానిక రూరల్ నియోజ కవర్గం 2వ డివిజన్ పెద్ద చెరుకూరు ప్రాంతంలో హరిత నగరాలు కార్యక్రమం నిర్వహణలో భాగంగా మొక్కలను నాటి సంరక్షణా బాధ్యతలను స్థానికులకు అప్పగించారు. నగర పాలక సంస్థ కమిషనర్ శ్రీమతి హరిత, వైఎస్సార్ సిపి రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, కార్పొరేటర్లు జానా నాగరాజు, రామ్ మోహన్ రావు, నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ, ఎస్.ఈ సంపత్ కుమార్, ఉద్యాన శాఖ ఏ.డి ప్రదీప్, డి.ఈ లు శేషగిరిరావు, సురేష్, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న కమిషనర్ హరిత

ముగిసిన ఓట్ల నమోదు..!

తూర్పు రాయలసీమ గ్రాడ్యుయేట్, టీచర్ల ఎన్నికలకు ఓట్లు నమోదు కార్యక్రమం ముగిసింది. సోమవారం సాయంత్రానికి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ఓట్లు నమోదు చేసుకున్నారు. తరువాత సర్వర్ నిలిచిపోయింది. తూర్పు రాయలసీమ నియోజకవర్గ పరిధిలో మొత్తం గ్రాడ్యుయేట్ ఓటర్లు 3,75,386 నమోదయ్యాయి. జిల్లాలో 1,09,647 ఓట్లు నమోదయ్యాయి. టీచర్ల ఓటర్లకు సంబంధించి నియోజకవర్గంలో 24,711 ఓట్లు చేరాయి. జిల్లాలో 7,389 ఓట్లు నమోదయ్యాయి. 2017 నాటికి ఎన్నికల్లో గ్రాడ్యుయేట్ ఓటర్లు 2,18,357 మంది, టీచర్లు 20,257 మంది ఓట్లు నమోదు చేసుకున్నారు. గతం కంటే ఎక్కువ ఓట్లు నమోదు చేసుకున్నారు. ఇందులో అనేక అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది. డిఇఒ రమేష్‌ను అక్రమంగా బదిలీ చేసి, ఇన్‌ఛార్జ్‌గా నియ మించిన గుంటూరు ఆర్‌జెడి సుబ్బారావు అక్రమాలకు తెరలేపారని విమర్శలు వస్తున్నాయి. టీచర్ అభ్యర్థి బంధువుల అపార్ట్‌మెంట్‌లో నకిలీ ఓట్లకు సంతకాలు చేస్తుండగా, పిడిఎఫ్ కార్యకర్తలు అడ్డుకున్నారు.

○నియోజకవర్గంలో గ్రాడ్యుయేట్ 3,75,386
○టీచర్లు 24,711
○జిల్లాలో 1,09,647 టీచర్లు 7,389
○ ఆర్‌జెడి నిబంధనలకు తూట్లు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

తూర్పు రాయలసీమ గ్రాడ్యుయేట్, టీచర్ల నియోజకవర్గం ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓట్లు నమోదు కార్యక్రమం ముగిసింది. అధికారపార్టీ ఈ ఎన్నికల్లో అక్రమాలకు తెరలేపింది. గతం కంటే భారీగా ఓట్లు నమోదు చేశారు. ప్రధానంగా వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు దగ్గరుండి ఓట్లునమోదు చేయించారు. అధికారపార్టీ నేతల ఆదేశాలతో పెద్ద ఎత్తున అక్రమ ఓట్లు చేర్చినట్లు తెలుస్తోంది. అనర్హులకు ఓట్లు చేర్చినట్లు విమర్శలు వస్తున్నాయి. మంగళవారం కొందరు ఆఫ్‌లైన్ దరఖాస్తులు తీసుకొని అధికారుల చుట్టూ తిరిగారు. ఆన్‌లైన్ అప్లికేషన్లు తీసుకోకపోవడంతో ఆఫ్‌లైన్‌లో ఇవ్వడానికి ప్రయత్నాలు చేశారు. 2024లో జరిగే సాధా రణ ఎన్నికలకు వీటిని సెమీ ఫైనల్‌గా భావిస్తున్నారు. అధికార వైసిపి ఎంఎల్‌ఎలు, నాయకులు ఓట్ల చేర్పులోనే అనేక అక్రమాలకు పాల్పడు తున్నారనే విమర్శలు న్నాయి.వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రభుత్వ ఉద్యోగులను ఇందు కోసం ఉపయోగించుకున్నారు. ప్రభుత్వ టీచర్లు, గ్రాడ్యుయేట్‌లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకంగా ఉన్న విషయం తెలిసిందే. దీని నుంచి బయటపడి సాధారణ ఎన్నికల్లో వలే ఎలాగైనా గెలవాలనే ఆ పార్టీ నేతలు అంతా తామై చేస్తున్నారు. గతంలో ప్రశాంతంగా సాగే ఈ ఎన్నికల్లో అధికారపార్టీ జోక్యంతో ఉత్కంఠ రేపుతుంది. సాధారణ ఎన్నికల వలే నగదు చెల్లించి ఓటర్లను కొనుగోలు చేయాలనే ఆలోచనలో ఉన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఏ నియోజకవర్గంలో ఎంత మెజార్టీ వస్తుందని ఇప్పటి నుంచే లెక్కలు కడుతున్నారు. పిడిఎఫ్ అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేయడంతోపాటు, అనేక ఉపాధ్యా య సంఘాలు మద్దతుగా నిలుస్తున్నాయి. ఉపాధ్యాయ, ప్రజా సంఘాలు పెద్దఎత్తున ప్రచారం సాగిస్తున్నాయి. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, పిడిఎఫ్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలనే ప్రచారం ఊపందుకుంది.



అపార్ట్‌మెంట్ ఎదుట నిలిచి ఉంచిన సుబ్బారావు అధికారిక వాహనం

నియోజవర్గంలో 3,75,386 జిల్లాలో 1,07,647 ఓట్లు నమోదు

తూర్పు రాయలసీమ ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓట్ల నమోదు ముగిసింది. ఈనెల 7వతేదీ వరకు నియోజకవర్గం పరిధిలో మొత్తం 3,75,386 ఓట్లు నమోదయ్యాయి. జిల్లాలో 1,07,647 ఓట్లు నమోదయ్యాయి. టీచర్ల ఓటర్లకు సంబంధించి నియోజకవర్గంలో 24,711 ఓట్లు నమోదయ్యాయి. జిల్లాలో 7,389 ఓట్లు నమోదయ్యాయి. గతం కంటే భారీగా ఓట్లు నమోదు చేసుకున్నారు. 2017 ఎంఎల్‌సి ఎన్నికల్లో గ్రాడ్యుయేట్‌కు సంబంధించి జిల్లాలో 55,438 ఓట్లు నమోదుకాగ, ప్రస్తుతం అది 1,07,647కు పెరిగింది. టీచర్లకు సంబంధించి 2017లో 4630 ఓట్లు నమోదు, ఇప్పుడు 7,389 ఓట్లు వచ్చాయి. నియోజవర్గ పరిధిలో 2017లో గ్రాడ్యుయేట్ ఓట్లు 2,18,357 ఓట్లు నమోద య్యాయి. ఇప్పుడు 3,75,386 ఓట్లు పెరిగాయి.

ఆర్‌జెడి అక్రమాలు..!

ఎంఎల్‌సి ఎన్నికల సమయంలో డిఇఒ రమేష్ బదిలీ అయ్యారు. ఇదే సమయంలో గుంటూరు ఆర్‌జెడి సుబ్బారావు. డిఇఒ ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. విధుల్లో చేరగానే ఆయన తన అక్రమాలకు తెరలేపారు. సోమవారం సాయంత్రం ఓట్లు నమోదు ప్రక్రియ ముగిసింది. రాత్రి 9గంటల ప్రాంతంలో చిల్డ్రన్ పార్క్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో ప్రత్యక్షమ య్యారు. టీచర్ అభ్యర్థి పి. చంద్రశేఖర్‌రెడ్డికి సహచరుడికి చెందిన ఓ అపార్ట్‌మెంట్‌లో కారు పెట్టకొని ఓట్లు నమోదు చేసే ప్రక్రియ సంతకాలు పెట్టారని తెలుస్తోంది. విషయం తెలుసుకున్న పిడిఎఫ్ కార్యకర్తలు అక్కడకు వెళ్లారు. విషయం తెలుసుకున్న ఆయన అక్కడ నుంచి కారు తీసుకొని వెళ్లిపో యారు. ఈ విషయంపై పిడిఎఫ్ అభ్యర్థులు, కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌జెడి ఓట్ల నమోదులో అక్రమాలకు పాల్ప డుతున్నారని విమర్శించారు.



ఆర్‌జెడి సుబ్బారావు ఉన్న చిల్డ్రన్స్ పార్కు సమీపంలోని వైసిపి అభ్యర్థి సహచరుని అపార్ట్‌మెంట్ ఇదే..

వ్యవసాయాన్ని కార్పొరేట్‌కు తాకట్టు పెట్టొద్దు

హక్కుల కోసం మరో పోరాటం చేయాలి - సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాళెం

వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు తాకట్టుపెట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నాయని, దీనిని తిప్పికొట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని దామర మడుగు గ్రామం పుచ్చలపల్లి సుందరయ్య కళా విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నెల్లూరు జిల్లా 19వ మహాసభలు ఘనంగా నిర్వహించారు. తొలుత వ్యవసాయ కార్మిక సంఘం జెండాను ఎగురవేసి కామ్రేడ్ జెడ్డా మస్తానయ్య, కామ్రేడ్ ఉంద్రాళ్ల మాలకొండయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సమావేశానికి పుల్లయ్య, తాళ్లూరు మాల్యాద్రి, దేవకుమారీలు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఈసందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల హక్కుల కోసం పోరాడేది కేవలం కమ్యూనిస్టు పార్టీయేనని పేర్కొన్నారు. దేశంలో మతోన్మాద శక్తులను రెచ్చగొట్టి బిజెపి పబ్బం గడుపుకోవాలని చూస్తోందన్నారు. వ్యవసాయ వ్యతిరేక చట్టాలను తీసుకొని వచ్చి కార్పొరేట్ శక్తులకు అప్పనంగా అందించాలని చూస్తున్న మోడీనే పెద్ద దేశ ద్రోహి అని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, లౌకిక వ్యవస్థ పరిరక్షణ కోసం వారు బిజెపికి వ్యతిరేకంగా పోరాడేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. లేకుంటే ఆర్థిక వ్యవస్థ ఎప్పుడైనా కూలిపోయే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే ప్రయత్నాలు బిజెపి ప్రభుత్వం చేస్తోందన్నారు.రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను తెచ్చి వారి హక్కులను కాలరాస్తోందని ధ్వజమెత్తారు.దేశంలో కానీ, రాష్ట్రంలో కానీ వ్యవసాయ కార్మికుల పరిస్థితి చాలా దుర్భరంగా ఉందన్నారు. వారికి ఎలాంటి హక్కులు గానీ, గ్యారెంటీలు గానీ లేవని చెప్పారు. కేవలం పాలకులు సంక్షేమ కార్యక్రమాల పేరుతో వేసే బిక్ష తప్ప భూపంపిణీ గానీ, కనీస వేతనాలుగానీ సంక్షేమ పథకాల్లో భాగంగా లేవని, పాలకుల విధానాల్లోనూ భాగంగా లేవని అన్నారు. నవరత్నాల్లో భాగంగా... భూపంపిణీ, కనీస వేతనాలు పెడితే అప్పుడు వ్యవసాయ కార్మికుల సంపద, వారి శ్రమ, శక్తి వాళ్లకే దక్కుతుందన్నారు. ప్రజల హక్కులను కాపాడకుండా బిక్ష వేస్తామని చెప్పడం దేశాభివృద్ధికి సహకరించదని స్పష్టం చేశారు. వ్యవసాయ కార్మికుల, వారి పిల్లల భవిష్యత్తు కోసం విద్య, వైద్యం, ఇల్లు, కనీస వేతనం, భూమి వంటి వాటిని సాధించుకోవడానికి సమగ్ర వ్యవసాయ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో సమగ్ర వ్యవసాయ చట్ట సాధన కోసం వ్యవసాయ కార్మికోద్యమం చేపడతామన్నారు. అన్ని పక్షాలను కలుపుకొని వ్యవసాయ కార్మికులందరినీ ఐక్యం చేసి పోరాడతామని పేర్కొన్నారు. వ్య.కా.సం. రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నెల్లూరు జిల్లా భూ పోరాటాల గడ్డ అని అన్నారు.వ్యవసాయ కార్మిక సంఘానికి నెల్లూరు జిల్లాకి ఎంతో అనుబంధం ఉందన్నారు. 1934లో జిల్లాలోని పుచ్చలపల్లి సుందరయ్య స్వగ్రామం అలగానిపాడులో వ్యవసాయ కార్మిక సంఘం నిర్మాణం జరిగిందని తెలిపారు. ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తరించి 80 లక్షల సభ్యత్వాలతో అతిపెద్ద సంఘంగా ఏర్పడిందన్నారు. దున్నేవాడికే భూమి ఇవ్వాలని, వెట్టిచాకిరి నుంచి విముక్తి పొందాలని, కనీస వేతనం అమలు కావాలని, సామాజిక న్యాయం జరగాలని, వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం కావాలని ఉద్దేశించి నెలకొల్పిన భూ సీలింగ్ చట్టం అసైన్డ్ భూముల, అటవీ హక్కుల చట్టాలన్ని పేదలకు భూములు పంచాలని, ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్నామన్నారు. అయితే ఇప్పటి వైసిపి ప్రభుత్వం పేదలకు ఇవ్వాల్సింది పోనిచ్చి పేదల దగ్గర లాక్కొని పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని విమర్శించారు. అందుకని రాష్ట్రంలో లక్ష ఎకరాల కోసం పేదలు భూ పోరాటం చేస్తున్నారన్నారు. నాలుగైదు దశాబ్దాలుగా సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలు అందించాలని, పోరాటాలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో భూమి విలువ పెరగడంతో పేదల దగ్గర భూములు లాక్కొని మరీ అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ శక్తులకు అప్పనంగా అందించాలని చూస్తున్నారన్నారు. పేదల భూముల జోలికి వస్తే ఖబడ్దార్ అని సవాల్ చేశారు. భూపంపిణీ జరగడానికి,ఉపాధి హామీ చట్టం సమగ్రంగా నిర్వహించడానికి, కనీస వేతనాలు అమలు, సామాజిక న్యాయం చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షల ఎకరాల భూమి పంపిణీ చేయాలన్నారు. పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని ఈ మహా సభలో తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర మహా సభలు ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో డిసెంబర్ 8,9,10 తేదీలలో జరగనున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలకు అఖిలభారత నాయకులు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ప్రజలను చైతన్యపరుస్తూ రైతులు, కార్మికులు ఉమ్మడిగా తమ హక్కుల కోసం ఉద్యమించాలని తెలిపారు.ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగరాజు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ముత్యాల గురునాథం, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పి.శ్రీరాములు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలివెంగయ్య, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి తుళ్లూరు గోపాల్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు చలంచర్ల రత్తయ్య, ముత్యాల నాగయ్య, నక్కా రాధయ్య, బుచ్చి, కోవూరు సిపిఎం మండల కార్యదర్శులు గండవరపు శ్రీనివాసులు, గండవరపు శేషయ్య, బుచ్చి సిఐటియు మండల కార్యదర్శి చల్లకొలుసు మల్లికార్జున, సిపిఎం నాయకులు పోతంశెట్టి శ్రీనివాసులు, షేక్ జానీ బాషా, బిల్లా రఘురామయ్య, పి.మల్లికార్జున తదితర నాయకులు, రైతులు, అభిమానులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి వెంకటేశ్వర్లు

నూతన కమిటీ ఎన్నిక

వ్య.కా.స జిల్లా అధ్యక్షుడిగా జొన్నలగడ్డ వెంకమరాజు,కార్యదర్శిగా మంగళ పుల్లయ్య, ఆఫీసు బేరర్స్ తాళ్లూరి మాల్యాద్రి, జి. వెంకటేశ్వర్లు, బట్టాపెద్ద అబ్బయ్య, నక్కా రాధయ్య, ముత్యాల నాగయ్య, పాతగుంట దేవకుమారి, పచ్చామధు, తంబి రమణయ్య, కోరికల విజయమ్మ, 22మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.



జొన్నలగడ్డ వెంకమరాజు (అధ్యక్షులు)



మంగళ పుల్లయ్య (కార్యదర్శి)

ఎంఎల్‌సి ఓట్ల నమోదులో అక్రమాలు

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి - ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాలు నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఎంఎల్‌సి విటపు, ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు

ఎంఎల్‌సి ఎన్నికల ఓట్ల నమోదులో అక్రమాలను నిరసిస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల నాయకులు నగరంలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు చలపతి శర్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శాసనమండలి ఎంఎల్‌సి విటపు బాలసుబ్రమణ్యం పిడిఎఫ్ ఉపాధ్యాయ అభ్యర్థి పి. బాబు రెడ్డి, ప్రజా సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ ఎం .మోహన్ రావు, ఎఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వి. రామరాజు, ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు మాదాల వెంకటకష్ణ, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి శేషులు పాల్గొని మాట్లాడారు. అధికార పార్టీకి చెందిన అభ్యర్థుల గెలుపుకోసం కార్పొరేట్ యాజమాన్యాలు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నాయన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా సంఘాల చేతికి చిక్కిన వందలాది అప్లికేషన్లు ఇందుకు నిదర్శనమన్నారు. డిఇఒ కార్యాలయంలో కార్పొరేట్ సంస్థల అప్లికేషన్లు రాత్రి 8 గంటల సమయంలో కౌంటర్ సైన్లు చేయడం,కష్ణ చైతన్య విద్యా సంస్థల ఎజిఎం ఇంటికి ఇన్‌ఛార్జి డిఇఓ వెళ్లి సంతకాలు పెట్టడం సిగ్గుచేటన్నారు. ఇది అధికార పార్టీ అక్రమాలకు పరాకాష్ట అన్నారు. ఎన్నికల సంఘం విచారణ చేపట్టి అక్రమాలకు సహకరిస్తున్న ఆర్‌జెడి, జిల్లా ఇన్‌ఛార్జి డిఇఓ సుబ్బారావును వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నమోదు అయిన ప్రతి దరఖాస్తును అధికారులు క్షుణంగా పరిశీలించాలన్నారు. బోగస్ ఓట్లను తొలగించాలని ,మూడు సంవత్సరాల సర్వీసు ఆరేళ్ల పెన్షన్ నిబంధనలు పాటించకుండా అక్రమంగా నమోదు చేసిన ఉపాధ్యాయ ఎంఎల్‌సి బోగస్ ఓట్లను తొలగించాలన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రతి జిల్లాకు ఐఎఎస్ అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించి వెరిఫికేషన్ చేపట్టాలన్నారు. ఓటర్ల నమోదులో జరిగిన అక్రమాలకు కారణమైన ప్రతి అధికారిపై ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కత్తి శ్రీనివాసులు, బత్తల కష్ణయ్య, ఉద్యోగ సంఘాల కన్వీనర్ ఆర్. నగేష్ ,ఏఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు కే. ఆంజనేయులు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మున్నా, సిరాజ్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి నరసింహ, డివి రమణ ,ఐద్వా నగర కార్యదర్శి కె పద్మ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలి :యుటిఎఫ్

నెల్లూరు :నవంబరు నెల ప్రారంభమై ఎనిమిది రోజులు పూర్తయినప్పటికీ జిల్లాలోని కొన్ని మండలాల్లో ఉపాధ్యాయులకు ప్రభుత్వం జీతాలు చెల్లించలేదని, వెంటనే అధికారులు స్పందించి ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని యూటిఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం ఈ మేరకు యూటిఎఫ్ జిల్లా కమిటీ ఓ ప్రకటన విడుదల చేసింది. జీతం పై ఆధారపడి ఉండే ఉపాధ్యాయులు అనేకమంది ఉన్నారన్నారు. ప్రభుత్వం నుంచి జీతాలు తీసుకుంటున్న ఉపాధ్యాయులు తమ కుటుంబ అవసరాల నిమిత్తం బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని వాయిదాల పద్ధతిలో ప్రతి నెల చెల్లించేవారన్నారు. వేతనాలు ఇవ్వకపోవడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయులకు రావాల్సిన జీతభత్యాలు వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జీవి. చలపతిశర్మ , వి.వి శేషు ఆ ప్రకటనలో కోరారు.

పట్టభుద్రుల ఓటు హక్కు కోసం

13,161 దరఖాస్తులు

కందుకూరు :తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల కోసం కందుకూరు నియోజకవర్గంలో 13,161 మంది ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తహశీల్దార్ డి.సీతారామయ్య తెలిపారు. అందులో అత్యధికంగా కందుకూరు మండలంలో 6158 మంది, ఉలవపాడు మండలంలో 2039, గుడ్లూరులో 1916, లింగసముద్రం 1671, వలేటివారిపాలెం మండలంలో 1377 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన వివరించారు. 2,286 అర్జీలకు ఆమోదం కాగా, 283 తిరస్కరణకు గురయ్యాయన్నారు. 10592 పరిశీలించాల్సి ఉందన్నారు.

టిడిపి కార్యకర్తకు ఆర్థిక సాయం

కందుకూరు :పట్టణంలోని 1వ వార్డు యర్రగుంటపాలెంకు చెందిన టిడిపి కార్యకర్త ముచ్చు రాకేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఒంగోలులోని సంఘ మిత్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతు న్నాడు. రాకేష్ కుటుంబం పేదరి కంలో ఉండటం, ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ పథకం అమలులో లేకపో వడంతో వైద్య ఖర్చులకోసం తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.ఈ విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు స్పందించి సంఘమిత్ర హాస్పిటల్‌కు వెళ్లి రాకేష్ ను పరామర్శించారు. రాకేష్ కుటుంబ సభ్యులకు రూ. 25 వేల ఆర్థిక సాయం అందించారు. వైద్య విషయంలో ఎలాంటి అవసరం వచ్చినా తనను సంప్రదించాలని నాగేశ్వరరావు వారికి సూచించారు. రాకేష్ ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లతో మాట్లాడారు. ఆర్థిక సహాయం అందించినందుకు రాకేష్ కుటుంబ సభ్యులు ఇంటూరి నాగేశ్వరావుకి కతజ్ఞతలు తెలిపారు. కందుకూరు పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, 1వ వార్డు అధ్యక్షుడు తూమాటి ప్రసాద్, పట్టణ బిసిసెల్ అధ్యక్షుడు ముచ్చు వేణు, దనేకుల ప్రసాద్, గుబ్బర బోయిన రామరాజు ఉన్నారు.



సాయం అందజేస్తున్న 'ఇంటూరి'

మంచినీటి శుద్ధి కేంద్రం పరిశీలన

నెల్లూరు :నగర వ్యాప్తంగా ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకుల ద్వారా అందిస్తున్న మంచినీటి సరఫరా పరిశుద్ధంగా ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని ఇరిగేషన్, ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ శ్రీమతి హరిత ఆదేశించారు. సంగం మండలం మహమ్మదాపురంలోని మంచినీటి శుద్ధి కేంద్రాన్ని అధికారులతో కలిసి కమిషనర్ మంగళవారం పరిశీలించారు. పెన్నానది నుంచి నీటిని సేకరిస్తున్న కేంద్రంలోని 122 ఎమ్.ఎల్.డి సామర్ధ్యం గల వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ మరియు ఇన్ టేక్ వెల్ ను పరిశీలించిన కమిషనర్ వివిధ విభాగాల పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇరిగేషన్ శాఖ డి.ఈ తిరుమలరావు, ఈ.ఈ ఆలీ, నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ సంపత్ కుమార్ పాల్గొన్నారు.

గేదె మృతి

కందుకూరు :మండలంంలోని పాలూరు, దొండపాడు గ్రామంలో విష పదార్థం తిని గేద మతి చెందింది. మంగళవారం గ్రామానికి చెందిన పశు పోషకుడు సోము రౌతు మాధవ కు చెందిన రూ. లక్షల విలువ చేసే గేదె మతి చెందింది. పశు వైద్యాధికారి డాక్టర్ చెన్నకేశవులు మతి చెందిన గేదెను పరిశీలించారు. విష పదార్థం తినడంతో మతి చెంది ఉండొచ్చని ఆయన తెలిపారు. ఉన్నతాధి కారులకు నివేదిక పంపించి ప్రభుత్వ సాయం అందేలా చూస్తానని తెలిపారు.

వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్

పొదలకూరు :మండలం లోని మహమ్మదాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మొగుళ్లూరు గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ లో భాగంగా వైద్యాధికారి డాక్టర్ ఎం రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్వహించారు. ఈ క్లినిక్‌ను మొగుళ్లూరు సర్పంచ్ ఆకుల లక్ష్మీ సందర్శించారు. ఈ క్లినిక్ ప్రాముఖ్యతను డాక్టర్‌తో చర్చించారు. ఇంటింటా వైద్యం ఫ్యామిలీ డాక్టర్ విధానం లో భాగంగా రోగులను పలుకూరు పాపిరెడ్డి, కాలేషా పరీక్షించి సూచనలు చేశారు. 104 డాక్టర్ ఆథిక్ రవికుమార్ , పర్య వేక్షకులు అనురాధ, ఆరోగ్య కార్యకర్తలు రాధిక, సుందరయ్య,అంకమ్మ, కమ్యూనిటీ హెల్త్ అడ్వైజర్ అమల, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధిపై చర్చకు సిద్ధం : వైసిపి

లింగసముద్రం : గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి జరగడం లేదని టిడిపి నాయకులు బాదుడే బాదుడు కార్యక్రమంలో విమర్శించడంపై మండల వైసిపి కన్వీనర్ పిచ్చపాటి తిరుపతిరెడ్డి ఖండించారు. మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లా డుతూ పెంట్రాల పంచాయి తీలోని రాళ్లపాడు, కొత్తపేట గ్రామాల్లో జరిగిన బాదుడే బాదుడు కార్యక్రమంలో కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు అవాస్తవాలు చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారన్నారు. మండలంలోని గ్రామాల్లో జరిగిన అభివృద్ధి గురించి బహిరంగ చర్చలకు టిడిపి నాయకుల సిద్ధమా అని వైసిపి నాయకులు ప్రశ్నించారు. టిడిపి నాయకులను, కార్యకర్తలను బెదిరించాల్సిన అవసరం వైసిపి నాయకులకు లేదన్నారు. వాస్తవాలు తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందన్నారు. వైసిపి మండల మీడియా అధికార ప్రతినిధి వరికూటి క్రిష్ణారెడ్డి, వైసిపి నాయకుల చీమల శ్రీనువాసులు యాదవ్,కేశంరెడ్డి క్రిష్ణారెడ్డి,గొర్రెపాటి చెంచురామయ్య, బత్తిన మధు,గంగినేని మధు,చల్లా రమణయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ట్రైనీ కలెక్టర్ పరిశీలన

నెల్లూరు :నగరంలోని విద్యాశాఖ రాష్ట్రీయ సమగ్ర శిక్ష కార్యాలయాన్ని ట్రైనీ కలెక్టర్ విద్యాధరి సందర్శించారు. మంగళవారం ఆ కార్యాలయానికి చేరుకున్న ట్రైనీ కలెక్టర్ అన్ని సెక్టోరియల్ అధికారులతో మాట్లాడి ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న అన్ని ప్రభుత్వ కార్యక లాపాలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకున్నారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. విద్యాశాఖాధికారులు ఉన్నారు.

మరుగుదొడ్ల నిర్వహణ అస్తవ్యస్తం

సిపిఎం నిరసన

నెల్లూరు :నగరంలోని ముత్తుకూరు రోడ్ సెంటర్‌లో సులభ్ కాంప్లెక్స్‌ను సక్రమంగా శుభ్రపరచకపోవడం కారణంగా ఆ పరిసర ప్రాంతాల్లో దుర్గంధం వెదజల్లు తోందని, కార్పొరేషన్ అధి కారులు వెంటనే స్పందించి ఆ ప్రాంతాన్ని పరిశుభ్రపరిచేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక సిపిఎం నాయకులు ఆర్ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం ముత్తుకూరు సెంటర్‌లో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ముత్తుకూరు, ధనలక్ష్మిపురం, కాకుపల్లి తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణికులు సులభ్‌కాంప్లెక్స్ సమీపంలో ఆర్‌టిసి బస్సుల కోసం వేచి ఉంటారన్నారు. ప్రతి నిత్యం విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించేందుకు చింతారెడ్డిపాళెం ప్రాంతంలోని విద్యాసంస్థలకు వెళ్లేందుకు అక్కడ వేచి ఉంటారన్నారు. అటువంటి ప్రదేశంలో ఉన్న సులబ్‌కాంప్లెక్స్‌ను సక్రమంగా శుభ్రపరచకపోవడం వల్ల వారంతా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు

పేదలకు ఉచిత న్యాయ సేవలు

తోటపల్లిగూడూరు :సమాజంలో వెనుకబడిన వర్గాలకు, మహిళలకు న్యాయ సేవ అధికార సంస్థల ద్వారా ఉచిత న్యాయసేవలు అందిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ ఎం. శ్రీనివాసులు నాయక్ పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ ,జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి. యామిని ఆదేశాల మేరకు మంగళవారం తోటపల్లిగూడూరు మండలం పామ్మెరువు, మహాలక్ష్మి పురం, ముత్యాల తోపు, పెద్దపాలెం, ముక్కంటమ్మ, కోనేటి తోపు, నెలిమిట్ట కండ్రిక ఎస్టీ కాలనీల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు జరిగాయి. శ్రీనివాసులు నాయక్ మాట్లాడారు. మండలంలో ప్రతి గ్రామంలో వెనుకబడి వర్గాల్లో న్యాయ చైతన్యం కలిగించడం కోసం విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లలు మత్తుపదార్థాలకు అలవాటు పడుతు న్నారని ఇది మంచిది కాదని జడ్జి సూచించారు. బాల కార్మిక వ్యవస్థ నిషేధం, హిందూ వివాహ చట్టం గురించి వివరించారు. అలాగే బాల్య వివాహాల చట్టం, బాలల హక్కుల గురించి శ్రీనివాసులు నాయక్ వివరించారు.ఎంపిడిఒ కన్నం హేమలత, ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి, పారాలీగల్ వాలంటరీ పి వేణుగోపాల్, పెంచల నరసయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి ఎం శ్రీనివాసులు నాయక్

'మెషిన్ లెర్నింగ్' పుస్తక రచనలో

'ప్రకాశం' అధ్యాపకులు

కందుకూరు :ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ విభాగంలోని ఇద్దరు అధ్యాపకులు ఆధునిక సాంకేతికతకు సంబంధించిన 'మేషిన్ లెర్నింగ్' బుక్ రచనలో భాగస్వామ్యులయ్యారని కరస్పాం డెంట్ కంచర్ల రామయ్య మంగళవారం వెల్లడించారు. డాక్టర్ కంచర్ల విజయ శ్రీనివాస్, డాక్టర్ పి.దిలీప్ కుమార్ మేషీన్ లెర్నింగ్ బుక్ రచనలో పాల్గొని కాలేజీ ప్రతిష్టను పెంచారని రామయ్య అభినందించారు. డాక్టర్ ఆరాధన అరవింద్, డాక్టర్ కె.గీతాంజలి తో కలిసి ఈ బుక్ ను రూపొందించి పబ్లిష్ చేశారన్నారు. ఇంటర్నేషనల్ స్టాండర్డ్ బుక్ నెంబర్ (ఐఎస్‌బిఎన్) అప్రూవల్‌తో ఈ బుక్ ప్రింటింగ్ కావడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం అమెజాన్ ద్వారా మార్కెటింగ్ జరుగుతుందని డాక్టర్ విజయ్, డాక్టర్ దిలీప్ లు పేర్కొన్నారు.హెల్త్ కేర్ తో పాటు వివిధ రంగాల్లో ముందస్తు విశ్లేషణకు మెషీన్ లెర్నింగ్ ప్రాధాన్యత సంతరించుకున్నందున భవిష్యత్తులో ఈ అంశాన్ని సాఫ్ట్ వేర్ రంగంలోనూ కీలక పాత్ర పోషించనుందని రచయితలు వెల్లడించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రవి కుమార్, సిఎస్ఇ విభాగం హెచ్ఒడి ఎం.ఎం.రాయుడు, వైస్ ప్రిన్సిపాల్ వి.హరిబాబు అకాడమిక్ ఇన్‌ఛార్జి ఎస్ఎం మిరావలి తదితరులు అభినందించారు.



బుక్‌ను అందుకుంటున్న కంచర్ల రామయ్య

తాగునీరు కలుషితం

గుడ్లూరు :గుడ్లూరులోని సినిమా హాల్ సెంటర్ దగ్గర డికె కాలనీ కి సరఫరా అవుతున్న రక్షిత తాగునీరు కలుషితమైందని కాలనీ వాసులు అధికారులకి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఆ ప్రాంతంలో సరఫరా అవుతున్న తాగునీరు దుర్గంధం వెదజల్లుతూ నలుపు రంగులోకి మారడాన్ని స్థానికులు గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు తగిన చర్యలు తీసుకుని మంచి నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలి దామ కష్ణయ్య పేర్కొన్నారు.

సండే మార్కెట్లో ఉద్రిక్తత

నెల్లూరు :నగరంలోని సండే మార్కెట్‌లో మంగళవారం రెండు గ్రూపుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. గతంలో సండేమార్కెట్‌లోని 70వ నెంబరు షాపు ప్రారం భోత్సవం సందర్భంగా ఘర్షణ చోటుచేసుకుంది. ఆ సందర్భంగా పలువురికి గాయాల య్యాయి. ఆ ఘటనపై పోలీసులు కేసులు నమోదు చేవారు. ఆ మార్కెట్‌లో 70వ నెంబరు దుకాణం యజమాని వ్యాపారం చేసుకొనేందుకు షాపును తెరిచేందుకు ప్రయత్నించాడు. ఈ సమాచారం తెలుసుకున్న యూనియన్ మద్దతు దారులు షాపు వద్దకు చేరుకొని దుకాణాన్ని తెరవడాన్ని అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొన్న నేపథ్యంలో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఇరు గ్రూపులకు సర్దిచెప్పేందుకు పోలీసులు ప్రయత్నం చేశారు. చివరకు యూనియన్ సభ్యులను పోలీస్టేషన్‌కు తరలించారు.

వైద్యరంగానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత

ప్రజాశక్తి-వింజమూరు

వైద్య రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తూ, నాడు-నేడు కార్య క్రమం ద్వారా వైద్యశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పనకు చర్యలు చేపట్టి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందేలా కృషి చేస్తున్నట్లు కలెక్టర్ కె.వి.ఎన్. చక్రధర్‌బాబు పేర్కొన్నారు. వింజమూరు మండల కేంద్రంలోని ప్రధాన రహదారి నుండి సామాజిక ఆరోగ్య కేంద్రం వరకు రూ.50 లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్డు నిర్మాణానికి మంగళవారం కలెక్టర్ చక్రధర్ బాబు, ఎంఎల్‌ఎ మేకపాటి చంద్రశేఖర్ రెడ్డితో కలిసి శంఖుస్థాపన చేశారు. అనంతరం వారు మొక్కలు నాటి, సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నాడు-నేడు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి ఒక వైపు పాఠశాలల్లో, మరో వైపు వైద్యశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడం జరుగుతుందన్నారు. నేడు రాష్ట్ర ప్రభుత్వం అన్నీ ప్రభుత్వం ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రుల్లో దాదాపు రూ.50కోట్లతో, జిల్లాలోని సి.హెచ్.సి.లు, ఏరియా ఆరోగ్య కేంద్రాల్లో రూ.70 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో 27 కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు నూతన భవనాలు మంజూరు చేసి పనులు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది కొరత లేకుండా నియామకాలు చేపట్టినట్లు కలెక్టర్ వివరించారు. గ్రామ స్థాయిలో ఉన్న సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఎ.ఎన్.ఎం.లు సమన్వయంతో పనిచేయాలని, అలా పనిచేసినప్పుడే గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయన్నారు. సుస్థిర అభివృద్ధి సూచికలో జిల్లా ముందంజలో ఉందని అలాగే హెల్త్ ఇండికేటర్స్‌లో కూడా జిల్లా ముందంజలో ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టిందని, ప్రజలు ఈ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అనంతరం ఎంఎల్‌ఎ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. ఆనాడు మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందేలా కృషి చేస్తే, వారి తనయులు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి తండ్రికి మించిన తనయుడుగా మరింతగా అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. ఉదయగిరి నియోజక వర్గం చాలా వెనుకబడిన ప్రాంతం, ఈ ప్రాంత అభివృద్ధికి జిల్లా యంత్రాంగం తమవంతు సహకారాలు అందిస్తుందని తెలియజేశారు. అనంతరం మండల కేంద్రం పరిధిలోని సచివాలయం-2, సచివాలయం-3లను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ పరిధిలో ప్రతిరోజు ఎన్ని అర్జీలు వస్తున్నాయి.. వచ్చిన అర్జీల్లో ఎన్ని పరిష్కరించారు.. ఎన్ని బియాండ్ ఎస్ఎల్ఎలో ఉన్నాయని సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలు సంతృప్తి చెందేలా మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈ సందర్భంగా సచివాలయ హాజరు రిజిష్టర్‌ను, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్.డి.ఒ. శీనానాయక్, డిసిహెచ్ఎస్ డాక్టర్ రమేష్ నాథ్, ఎపిఎంఎస్ఐడిసి ఇఇ విజయభాస్కర్, సెంట్రల్ సిఇఒ పుల్లయ్య, ఎంపిపి ఇరగనూరి మోహన్ రెడ్డి, సొసైటీ ఛైర్మన్ రాజారావు, సర్పంచ్ నల్లగొండ సృజన, డాక్టర్ శ్వేత, డాక్టర్ మధు, ఎంపిడిఒ స్వరూప రాణి, ఇన్‌ఛార్జి తహశీల్దార్ కృష్ణప్రసాద్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎంఎల్ఎ

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి-కావలి

కావలి మున్సిపల్ కార్మికులను త్వరితగతిన పర్మినెంట్ చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.పెంచలనర్సయ్య పేర్కొన్నారు. ఈ మేరకు ఎస్.ఆనందరావు అధ్యక్షతన ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) కావలి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక షాదీ మంజిల్‌లో 3వ పట్టణ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా పెంచలనర్సయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గతంలో వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరికీ పర్మినెంట్ చేస్తామని, అప్పటివరకు కనీస వేతనం రూ.26,000 ఇస్తామని హామీని ఇచ్చినట్లు తెలిపారు. మూడున్నర సంవత్సరాలు పూర్తి కావస్తున్న ఇంతవరకు దాని గురించి పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారం చేయకుండా, ఏదో ఒక రూపంలో వారిని ఇబ్బందులకు గురి చేసే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. పోరాడి సాధించుకున్న హెల్త్ అలవెన్స్ తిరిగి, కార్మికుల ఖాతాల నుండి జమ చేసుకుంటామని చెప్పడం దారుణమన్నారు. అదేవిధంగా గత సమ్మె సందర్భంగా మున్సిపల్ కార్మికుల సమస్యలన్నీ పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చి,ఇంతవరకు ఏ ఒక్క సమస్య కూడా పరిష్కారం చేయలేదని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్.కె.రెహానాబేగం మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై సిఐటియు అలుపెరగని పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ మహాసభ ఆ పోరాటాలకు తోడ్పాటు అందించాలన్నారు. రాబోయే రోజులలో కార్మికుల సమస్యలపై కార్మికులందరూ ఐక్య పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో కార్మికులందరూ ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీ 21 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా పసుపులేటి పెంచలయ్య, అధ్యక్ష కార్యదర్శులుగా తురక సీనయ్య, బిడదల మహేష్, కార్యదర్శి వర్గంలో కావలి యేసు, మంద భాస్కర్, పి.జేమ్స్, ఒంగోలు రమేష్, కె.శివ, కోటయ్య, పి.చిన్నమ్మ, రాజ్యలక్ష్మి, మహేశ్వరి, అనురాధ లను ఎన్నుకున్నారు. మహాసభలో యుటిఎఫ్ నాయకురాలు బి.శ్రీదేవి, సిఐటియు నాయకులు పి.పెంచలయ్య, టి.సుబ్బరాయశర్మ, వై.రవి, డివైఎఫ్ఐ నాయకులు పి.పెంచలనరసింహా, వై.కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కె. పెంచల నర్సయ్య

ఓట్ల నమోదును పారదర్శకంగా నిర్వహించండి

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్ : ఎంఎల్‌సి ఓట్ల నమోదు ప్రక్రియను పారదర్శకంగా ఎలాంటి అవకతవకులకు తావివ్వకుండా నిర్వహించాలని యుటిఎఫ్, సిపిఎం నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తూర్పు రాయలసీమ గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఓట్ల విచారణ ప్రక్రియలో అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా అర్హత కలిగిన వారికి ఓటు హక్కు కల్పించాలని కోరుతూ మంగళవారం తహశీల్దార్‌కు వివిధ ప్రజా సంఘాల నాయకులు కలిసి మెమొరాండం అందజేశారు. ఎంఎల్‌సి ఓట్ల వెరిఫికేషన్‌లో ఆధార్‌లోని అడ్రస్‌కు సంబంధం లేకుండా వారు ప్రస్తుతం నివాసమున్న చిరునామాలో ఓటు హక్కు కల్పించాలని, వెరిఫికేషన్‌కు వస్తున్న బిఎల్ఒలు ఫోన్ ద్వారా కాకుండా ఇంటి వద్దకు వెళ్లి భౌతికంగా విచారించి సంబంధిత పత్రాల నకళ్లను తీసుకొని అర్హత కలిగిన వారికి ఓటు హక్కు కల్పించాలని కోరారు. 23వ తేదీ ప్రోవిజనల్ ఓటర్ లిస్టును సకాలంలో అందుబాటులోకి తేవాలని ప్రయివేట్ టీచర్లకు సంబంధించి ఉపాధ్యాయ ఓటు హక్కు ఫారం-19 విచారణలో పిఎఫ్ 6 సంవత్సరాలు కట్టిన వారికి మాత్రమే అర్హత ఉంటుందని దానిని జాగ్రత్తగా విచారించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి.వి శివప్రసాద్, సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు, కౌలు రైతు సంఘం ఉపాధ్యక్షులు గంటా లక్ష్మీపతి, సిఐటియు మండల అధ్యక్షులు నాగయ్య, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ సంధాని, వాగాల శ్రీహరి, యుటిఎఫ్ నాయకులు శివప్రసాద్‌రావు, హరికృష్ణ, సుధాకర్ రావు, పెంచలయ్య పాల్గొన్నారు.

పంటలు పరిశీలన



ప్రజాశక్తి-సీతారామపురం : మండలంలోని మారంరెడ్డిపల్లి రైతు భరోసా కేంద్రం పరిధిలోని పలు పంటలను మండల వ్యవసాయ అధికారి పి.చెన్నారెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయన రైతు భరోసా కేంద్రంలో రికార్డులను పరిశీలించి మాట్లాడుతూ మినుములో రసం పీల్చు పురుగులు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. దాని నివారణకు లీటరు నీటిలో 1.5 గ్రాముల అసిపెట్ పిచికారి చేయాలని సూచించారు. వరిలో ఉల్లికోడు వ్యాప్తి ఉన్నట్లు గుర్తించామన్నారు. నివారణకు కార్బో ఫ్యూరిన్‌ను 3 జి గుళికలు 6 నుంచి 8 కేజీలు 20 కిలోల ఇసుకలో కలిపి చల్లాలన్నారు. అనంతరం జామతోటను పరిశీలించారు. కార్యక్రమంలో ఎఇఒ నారాయణ, విఎఎ లక్ష్మీ నారాయణ, వెంకటేశ్వర్లు, రైతు గాజులపల్లి చంద్రారెడ్డి తదితరులున్నారు.

నూతన కమిటీ ఎన్నిక



ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం కప్పొట్రాళ్ల తిప్ప గ్రామంలో నూతనంగా ఏర్పాటైన ఎరుకల వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీని ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా బి.మృత్యుంజయ, వైస్ ప్రెసిడెంట్ పి.మనోహర్, జనరల్ సెక్రటరీ ఏ.రాజు, జాయింట్ సెక్రెటరీ సిహెచ్.క్రాంతి కుమార్, ఆర్గనైజర్ సెక్రెటరీ ఏ.చక్రపాణి, ట్రెజరర్ పి.ప్రతీష్ కుమార్, జాయింట్ ట్రెజరర్ పి.రమేష్ సభ్యులుగా గ్రామస్తుల సమక్షంలో ఎన్నుకోబడ్డారు. ఈ అసోసియేషన్ ద్వారా ఎరుకులకు సంబంధించిన కులస్తులకు ప్రభుత్వం ద్వారా అందే అన్ని వసతులను ఏర్పాటు చేయడం వారికి ఆర్థికంగా ఉద్యోగ పరంగా అన్ని విధాల వెన్నుదన్నుగా నిలువడానికి ఈ కార్పొరేషన్ అన్ని విధాల సకారాలు అందివ్వనున్నట్లు కమిటీ సభ్యుల పేర్కొన్నారు.

'పాలీక్యాబ్' ప్రచారం

ప్రజాశకి-నెల్లూరు : సుప్రసిద్ధ ఎలక్ట్రికల్ గూడ్స్ కంపెనీ, పాలీక్యాబ్ ఇండియా లిమిటెడ్ (పిఐఎల్) ఇప్పుడు దేశంలో కేబుల్స్, వైర్స్ ల్యాండ్‌స్కేప్‌ను సమూలంగా మార్చడానికి సిద్ధమైంది. తమ తాజా టెలివిజన్ కమర్షియల్‌ను విడుదల చేసింది. దీనిద్వారా ప్రతి ఒక్కరి భద్రత, సంక్షేమం కోసం తమ పాలీక్యాబ్ గ్రీన్ వైర్ వినియోగాన్ని ప్రచారం చేస్తోంది. 'ఎక్స్‌ట్రా సేఫ్ వైర్ అంటే ఎక్స్‌ట్రా సేఫ్ డ్రీమ్స్' అంటూ చేస్తోన్న పాలీక్యాబ్ ప్రచారం వినూత్నంగా ఉండటంతో పాటుగా నేటి తరపు వినియోగదారులకు వైర్లు, కేబుల్స్ విలువ ప్రతిపాదనలను గురించి తెలుపుతుంది. దాంతోపాటుగా ఈ ఉత్పత్తుల ప్రయోజనాలనూ వివరిస్తుంది. ఈ ప్రచారం ద్వారా వైర్ల నాణ్యతపై ప్రజలు మరింత అప్రమత్తతతో వ్యవహరించాల్సిందిగా చెబుతూనే అత్యంత శక్తివంతమైన మానవ కథలను ప్రదర్శిస్తోంది. ఈ కథల ద్వారా కేవలం ఎక్స్‌ట్రా సేఫ్ పాలీక్యాబ్ గ్రీన్ వైర్‌లను ఊహాతీత లోడ్‌ను సైతం తట్టుకునేలా తీర్చిదిద్దారు.

పలుచోట్ల 'అక్షర చైతన్యం' కార్యక్రమం



ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ గోవిందరాజులు ఆధ్వర్యంలో మండలంలోని సచివాలయ విద్యా, సంక్షేమ సహాయకులు, మహిళా పోలీసులకు అక్షర చైతన్యంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ కలెక్టర్ మానసపుత్రిక అక్షర చైతన్యం కార్యక్రమాన్ని మండలంలోని అన్ని సచివాలయాలలో ప్రతిష్టాత్మకంగా అమలు చేసి ఇప్పటికే గుర్తించబడిన లబ్ధిదారులను కేంద్రాలకు హాజరయ్యేలా చూసి వారినందరినీ 100శాతం అక్షరాస్యులుగా మార్చాలన్నారు. విద్యా, సంక్షేమ సహాయకులు, మహిళా పోలీసులు రేపు వారి సచివాలయంలో వాలంటీర్లకు ఈ వాచకాలపై శిక్షణను ఇవ్వాలని వాలంటీర్స్ అందరూ అక్షర చైతన్యం కార్యక్రమంలో నిబద్ధతతో పనిచేసి గౌరవ కలెక్టర్ ఆశయాన్ని చిత్తశుద్ధితో విజయవంతంగా పూర్తి చేయాలని కోరారు. జగనన్న పచ్చతోరణం కార్యక్రమంలో భాగంగా బోగోలు మండలంలో అన్ని సచివాలయాల పరిధిలో గుర్తించబడిన ప్రతి నిరక్షరాస్యునితో ఒక మొక్కను నాటించి ఆ మొక్కను సంరక్షించేలా ప్రేరేపించాలని తెలిపారు. ప్రతిరోజూ కేంద్రాలను నిర్వహిస్తూ లబ్ధిదారులు క్రమం తప్పకుండా కేంద్రాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమానికి వయోజన విద్యాశాఖ పర్యవేక్షకులు ఒ.నారాయణరావు శిక్షకునిగా వ్యవహరించారు.

అక్షరాశ్యతకు దోహదపడాలి



ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్ : మండలంలోని అన్ని సచివాలయంలోని సంక్షేమ విద్యా సహాయకులు, మహిళ పోలీసులు కలసి అక్షరాస్యత పెంపుదలకు మరింతగా దోహదపడాలని ఎంపిడిఒ సి.శ్రీనివాసులు తెలియజేశారు. కలెక్టర్ చక్రధర్‌బాబు, డిపిఒ ధనలక్ష్మి ఆదేశాల మేరకు మంగళవారం మండల కార్యాలయంలో అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్వైజర్ ఎల్.రామ్ కుమార్ సమక్షంలో అక్షర చెతన్యం-2 శిక్షణ కార్యక్రమం మండలంలోని 11 సచివాలయాలకు సంబంధించిన వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు, మహిళా శిశుసంక్షేమ కార్యదర్శులకు సంయుక్తంగా శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, విద్యాసహాయకులు పాల్గొన్నారు.

సంగం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం అక్షర చైతన్యం-2 కార్యక్రమంపై వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులకు అడల్ట్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ రమేష్‌బాబు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్షర చైతన్యం-2 కార్యక్రమాన్ని గ్రామాల్లో అవగాహన కల్పించాలని వారికి సూచించారు. అనంతరం అక్షర చైతన్యం పుస్తకాలను వారికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ జానకీరామ్, రిసోర్స్‌పర్సన్ రామ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అంతా నుడా మయం..!

- నుడాలో కలిసిన అల్లూరు, బోగోలు, దగదర్తి

ప్రజాశక్తి-అల్లూరు : కావలి నియోజకవర్గంలోని అల్లూరు, బోగోలు, దగదర్తి మండలాలు, అలాగే కావలిరూరల్ మండలంలో కొన్ని గ్రామాలను నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో చేర్చి ఈ మేరకు అధికారులు జిఒ జారీ చేశారు. అక్టోబర్ 26న ఆంధ్రప్రదేశ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి ఉత్తర్వులు అమలు చేశారు. అల్లూరు మండలంలో సింగపేట, నార్త్ మోపూరు, వెలిచెర్ల, గోగులపల్లి, గ్రద్దగుంట, బీరంగుంట ఇందుపూరు పురిణి, అల్లూరు, అల్లూరుపేటను చేర్చారు. అలాగే బోగోలు మండలంలో కేబీ కండ్రిగ, ఎబి కండ్రిగ, తాళ్లూరు, జక్కేపల్లి గూడూరు, ఉమామహేశ్వరపురం, ముంగమూరు, సాంబశివపురం, జువ్వలదిన్నె, సిద్ధవరపు వెంకటేశుపాలెం, మల్లాయపాలెం అలాగే దగదర్తి మండలంలో బోడగుడి పాడు, మనుబోలు పాడు, మారెళ్లపాడు, దుండిగం, ఐతంపాడు, రంగసముద్రం, లింగాలపాడు, కాట్రాయపాడు, వెలుపోడు, కామినేనిపాలెం, దగదర్తి, చెన్నూరు, తిరివీధి పాడు, తురిమెర్ల, యలమంచి పాడు, పెద్ద పుత్తేడు, చవటపుత్తేడు, ఊచగుంటపాలెం కావలి మండలంలో చలంచర్ల, రాజువారి చింతలపాలెం, కొత్తపల్లె, చెన్నాయపాలెం, తుమ్మలపెంట, మన్నగిదిన్నె, తాళ్లపాళెం ఆయా గ్రామాలు ఇకనుండి నుడా పరిధిలో కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు. పట్టణ ప్రణాళిక విభాగం అంతా నుడాతో ముడిపడి ఏమి చేయాలన్నా అనుమతులు తప్పనిసరి తీసుకోవాలంటున్నారు. ప్రధానంగా నూతనంగా లేఅవుట్లు ఏర్పాటు చేయాలంటే అప్రూవల్ తీసుకోవాల్సిందే. ఇందుకు భిన్నంగా ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే తదుపరి చర్యలుంటాయని సమాచారం. ఇకనుండి నూతనంగా బిల్డింగులు ఏర్పాటు చేయాలన్నా అధికారులను కలసి అనుమతులు పొందాల్సి ఉంటుంది.

'నలంద' విద్యార్థికి అంతర్జాతీయ అవార్డు

ప్రజాశక్తి-కావలి

వరల్డ్ బుక్ అఫ్ రికార్డ్స్ - లండన్ వారు నిర్వహించిన పోటీ పరీక్షలో విజయం సాధించిన నలంద టాలెంట్ విద్యార్థినీ పి.సువర్ణికను మంగళవారం ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతిచిన్న వయసులోనే ఇంతటి ప్రతిభను కనపరుస్తున్న సువర్ణిక భవిష్యత్తులో కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. అంతేగాక పిల్లల్లోని నైపుణ్యాలని, ప్రతిభను గుర్తించి ప్రతి ఏటా ఎంతో మంది పిల్లలను పోటీ పరీక్షల కోసం తయారు చేస్తూ ఉన్న నలంద యాజమాన్యాన్ని కూడా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నలంద విద్యా సంస్థల ఛైర్మన్ ఎమ్‌డి.మజహర్ మాట్లాడుతూ తాము స్థాపించిన ఈ నలంద విద్యా సంస్థలు పిల్లలకు విద్యా బుద్ధులు నేర్పించడంలోనే కాకుండా వారిలో నిగూఢంగా దాగి ఉన్న ప్రతిభను వెలుగులోకి తీసుకొని రావడంలో కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని తెలియజేశారు. తమ పాఠశాలలో చదివిన ఎంతోమంది విద్యార్థులు ఇప్పుడు ఎంతో గొప్ప స్థాయిల్లో ఉన్నందుకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న డైరెక్టర్ ఎమ్‌డి.వసీం మాట్లాడుతూ పిల్లల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసి ప్రోత్సహించడంలో నలంద యాజమాన్యం ఎప్పుడూ ముందుంటుందని తెలియజేశారు. తమ పాఠశాలలో చదువుతూ ఇంతటి విజయాన్ని సాధించిన సువర్ణికను అభినందించారు. కార్యక్రమంలో ఎంఎల్‌ఎ ప్రతాప్‌కుమార్‌రెడ్డి, నలంద విద్యాసంస్థల చైర్మన్ ఎమ్‌డి.మజహర్, డైరెక్టర్స్ ఎమ్‌డి.వసీం, ఎమ్‌డి.ఫహీం, ప్రిన్సిపల్, తల్లితండ్రులు పాల్గొన్నారు.


విద్యార్థినిని అభినందిస్తున్న ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అండర్-19 కబడ్డీకి విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-కావలి

నెల్లూరు లో సోమవారం జరిగిన అండర్-19 కబడ్డీ సెలక్షన్స్ లో "నెల్లూరు జిల్లా టీము"కు బాలుర విభాగంలో "కావలి శ్రీ చైతన్య జూనియర్ కళాశాల"కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. వారిలో ముత్యం పవన్‌కుమార్ (సీనియర్ యింటర్), పి.ఏకనాథ్ (జూనియర్ ఇంటర్), బాలికల విభాగంలో సి.హెచ్.ఆషా (సీనియర్ ఇంటర్) మొదలైనవారు ఎంపికయ్యారు. వీరికి కోచింగ్ ఇచ్చిన పీడీ వెంకటేశ్వర్లును కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం ఘనంగా అభినందించింది.



ఎంపికైన శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు

న్యాయం జరిగే వరకూ దీక్ష : బిఎస్‌పి

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్

గత 15 రోజులుగా బి.ఎస్.పి. ఆధ్వర్యంలో చేజర్ల మండలం పెళ్లేరు గ్రామానికి చెందిన దళితులు ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేస్తుండడంతో మంగళవారం కొంతమేర క్షత పరిస్థితులు నెలకొన్నాయి. ఆర్‌డిఒ ఆదేశాల మేరకు డిఎస్‌పి వెంకటేశ్వరరావు, సిఐ నాగేశ్వరరావు చర్చలకు రావాలని రిలే నిరాహార దీక్షలు చేస్తున్న వారిని కోరడంతో తమకు న్యాయం జరిగే వరకూ నిరాహార దీక్షలు కొనసాగిస్తామని ఖరాఖండిగా చెప్పారు. అయితే వారి వివరాల మేరకు.. గత 15 రోజుల నుండి చేస్తున్నామని ఆర్‌డిఒ వచ్చి తమకు ఒక హామీ ఇచ్చారని, పెళ్లూరు గ్రామానికి చెందిన భూములేని పేదలకు ఒక్కొక్కరికి ఒక ఎకరాను అడుగుతున్నామన్నారు. అలా ఇవ్వని పక్షంలో, అది చట్టబద్ధం కానీ పక్షంలో పెన్నా పరివాహక ప్రాంతంలో 800 ఎకరాలు ఏదైతే ఉందో ఒక్కొక్కరు అక్కడ ఉన్న భూస్వాములు ఒక్కొక్కరు 100, 150, ఎకరాలు అక్రమంగా ఆక్రమించుకొని కరెంటు కనెక్షన్లు తీసుకొని అనుభవిస్తున్నారో అంతా అధికారులే దగ్గరుండి అందరికీ న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ అక్రమాల వల్ల ప్రభుత్వానికి నష్టం కలుగుతుందని, ఈ నష్టమంతా కూడా అధికారులు నిర్లక్ష్యం వల్లే వారు దౌర్జన్యానికి అక్కడ ఆక్రమించుకొని చేస్తున్నారన్నారు. ఈ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా తాము ఇక్కడ ధర్నా చేస్తున్నామని అధికారులు తప్పుడు ఎన్ఒసిలు ఇచ్చి ఉన్నారని, వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ కనెక్షన్లు కట్‌చేసి వాటిని తొలగించాలని, పేద రైతులు అక్కడ నిర్మించిన షెడ్డును తొలగించాలని, అవి నెరవేర్చిన తర్వాతనే ఈ నిరాహార దీక్ష విరమించుకుంటామని బిఎస్‌పి నియోజకవర్గ అధ్యక్షుడు నంద ఓబులేసు, కృష్ణయ్యలు తెలిపారు.


బిఎస్‌పి నేతలను చర్చలకు ఆహ్వానిస్తున్న పోలీసులు

ఎంఎల్‌ఎ సూచనలతో రిలే నిరాహార దీక్ష విరమణ

గత రెండు రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న చేజర్ల మండలం పెళ్లేరు దళిత రైతులు ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనల మేరకు మంగళవారం నిరాహార దీక్ష విరమణ చేశారు. పెళ్లేరు దళిత కాలనీకి చెందిన రైతులకు 40 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం 60 కుటుంబాలకు 65 ఎకరాలు భూమిని పంపిణీ చేశారు. గత ప్రభుత్వ కాలంలో మాజీ ఎంఎల్‌ఎ సోదరుడు ఆ భూములను ఆక్రమించుకునే తమను ఇబ్బందులు పెడుతున్నారని ఆ భూములను రికార్డుల్లోనూ తమ కుటుంబ సభ్యుల పేర్లతో నమోదు చేయించుకున్నాడని బాధ్యత దళితులు ఆరోపించారు. గత మూడేళ్లుగా ఈ విషయంపై అధికారుల చుట్టూ తిరుగుతున్నామని న్యాయం జరగడం లేదని దీంతో ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టమని తెలిపారు. వైసిపి నాయకుడు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో చర్చలు జరుపుతున్న క్రమంలో ఫోన్ ద్వారా ఎంఎల్‌ఎ విక్రమ్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాడు. స్పందించిన ఆయన ఈ విషయంపై గురువారం బాధ్యతలతో అధికారులతో చర్చలు జరిపి న్యాయం చేస్తామని తెలపడంతో దీక్షను విరమించారు.

సౌదీలో స్వర్ణం సాధించిన అల్లూరువాసి

ప్రజాశక్తి-అల్లూరు



సౌదీ అరేబియాలో ఇటీవల జరిగిన బ్యాడ్మింటన్ పోటీలలో స్వర్ణ పతాకం సాధించి రూ.2 కోట్ల ప్రైజ్‌మనీని సొంతం చేసుకున్న అల్లూరువాసి మెహద్‌షాను మంగళవారం గ్రామస్తులు అభినందించారు. మా గ్రామానికి ఇంత విజయం సాధించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు వారి తల్లిదండ్రులు షేక్ షాహీద్, షాకీర పతాకంపై హర్షం వ్యక్తం చేశారు. చిన్నప్పటి నుంచి క్రీడలపై ఎంతో మక్కువ పెంచుకొని ఆసక్తి కనబరిచే వారిని పేర్కొన్నారు. కేవలం స్వయంకృషితో స్వర్ణపతకం సాధించి భారతదేశానికి మంచి పేరు ప్రతిష్టలు చేకూర్చారని వివరించారు. సొంత గ్రామానికి సైతం వన్నె తెచ్చాడని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈనాడు దేశం క్రీడల్లో రాణిస్తూ అగ్రగామిగా ఉందని తెలిపారు. భారత ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులకు చేయూతనివ్వాలని ఆకాంక్షించారు. ఈ విజయం అందరికీ సొంతమని క్రీడాకారులకు తమవంతు సహకారం అందిస్తామన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆత్మకూరు అర్బన్



ఆత్మకూరు డిఎస్‌పి కార్యాలయంలో ప్రో చైల్డ్ గ్రూప్ హెడ్స్ సంస్థ డైరెక్టర్ ఎన్‌డిసిఆర్ఎఫ్ ఆత్మకూరు డివిజన్ ఇన్‌ఛార్జి వెలగపాటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆత్మకూరు డి.ఎస్.పి. కె.వెంకటేశ్వరరావు చేతుల మీదుగా మంగళవారం బాలల హక్కుల వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు డి.ఎస్.పి. మాట్లాడుతూ పిల్లలకు సురక్షితమైన బాల్యమే కాక ఇంకా ఎన్నో రకాల హక్కులు ఉన్నాయని అలాగే అవసర సమయాల్లో పోలీసులకు పిల్లల సంరక్షణ సమస్యలకు ఫిర్యాదు చేసి అవసరమైన చట్ట భద్రతను కలిగించడం అవసరమన్నారు. పిల్లల కష్టాలకు తల్లిదండ్రులు వారి కుటుంబ సభ్యులు మాత్రమే కారణం అన్న భావన సరైనది కాదన్నారు. లైంగిక వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని బాలల సంరక్షణ కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన పోక్సో చట్టం 2012 ఒక వరం అని తెలిపారు. బాల్యవివాహాలు అరికట్టడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. బాల బాలికలు అన్ని రంగాల్లో సమానమన్నారు. హెడ్స్ సంస్థ డైరెక్టర్ 2019 జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ వెలగపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సురక్షిత వాతావరణంలో పిల్లలు ఉండేలా చూడాలని వీలున్నంత ఎక్కువగా పిల్లలతో సంభాషిస్తూ వారి మనసు తెలుసుకొని జాగ్రత్తలు తీసుకోవడం పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాధ్యత అని తెలిపారు. పిల్లల రక్షణకి ప్రమాదం కలిగించే వాటిని తెలుసుకొని అలాంటి ప్రమాదాలను నివారించడానికి కృషి చేయాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు.

'అభిరామ్'లో ఆరోగ్యశ్రీ సేవలు సంతృప్తికరం

- జిల్లా వైద్యాధికారి ఎం. పెంచలయ్య

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్



పట్టణంలోని అభిరామ్ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని జిల్లా వైద్యాధికారి ఎం.పెంచలయ్య పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ నిర్వహణను మంగళవారం ఆయన అభిరామ్ హాస్పిటల్ ఎమ్‌డి డాక్టర్ శ్రావణ్ కుమార్, డాక్టర్ మేకపాటి దీప్తి సమక్షంలో పరిశీలించారు. హాస్పిటల్లో వసతులను పరిశీలించి సంతృప్తిగా ఉన్నాయని తెలియజేశారు. అనంతరం జిల్లా వైద్యాధికారి డాక్టర్ పెంచలయ్యను శాలువాతో సన్మానించారు. క్లర్కు సిహెచ్.రామకృష్ణ, టిబి హాస్పిటల్ సూపర్వైజర్ వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి-దగదర్తి : మండలంలోని చవట పుత్తేడు, శ్రీరామపురం (పెద్ద పుత్తేడు) గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇరు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాగు దాటి ఎందుకు తాత్కాలికంగా పైపులను వేసి వాటిపై గ్రావెల్ తోలి రాకపోకలు సాగించేలా చేయాలని పేర్కొంటున్నారు. మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పిల్లి వాగు ఉధృతంగా ప్రవహించడంతో పోసిన గ్రావెల్ కొట్టుకోపోవడంతో రాకపోకలకు నిలిచిపోయాయని తెలిపారు. శ్రీరాంపురం నుంచి దగదర్తికి రావాలంటే తురిమిళ్ల, చెన్నూరు గ్రామాల మీదగా దగదర్తి రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, దీని ద్వారా చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై గ్రామాల ప్రజలు మాట్లాడుతూ గతంలోని బ్రిడ్జి నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయని, అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇంతవరకు బ్రిడ్జి నిర్మాణం పనులను చేపట్టిన దాఖలాలు లేవని తెలిపారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఇంతవరకు పట్టించుకున్న పాపాన పోలేదని వాపోయారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారుల దృష్టి సారించి బ్రిడ్జిని నిర్మించేందుకు చొరవ చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.


గ్రావెల్ కొట్టుకుపోయి ఉన్న దృశ్యం

13న సంతాప సభ

ప్రజాశక్తి-మర్రిపాడు : అక్టోబర్ 19న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు మందాడి నరసింహులు అకాల మృతికి చింతిస్తూ 13న యుటిఎఫ్ భవనంలో సంతాపసభ నిర్వహించనున్నట్లు మండల యుటిఎఫ్ శాఖ తెలియజేసింది. ఆత్మీయులు, చిన్న వయస్సు లోనే మన్ననలను, అభిమానాన్ని పొంది ఆకస్మాత్తుగా మృతి చెందడం బాధాకరమని పేర్కొంది. ఆయన అకాల మృతికి చింతిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ సంతాప సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేసింది. రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు యుటిఎఫ్ మండల శాఖ తెలిపింది. మండల యుటిఎఫ్ సభ్యులు ఉపాధ్యాయ సంఘాల నేతలు, మిత్రులు శ్రేయోభిలాషులు పాల్గొని వారి కుటుంబానికి మనోధైర్యం ఇవ్వాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం



ప్రజాశక్తి-ఉదయగిరి : ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం రైతులు పొందవచ్చుని ఐదు మండలాల ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి, ప్రకృతి వ్యవసాయ ప్రధాన శిక్షకులు మల్లెల సురేష్ అవగాహన కల్పించారు. మంగళవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో డివిజన్ స్థాయి ఐదు మండలాల ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ఆయన ప్రకృతి వ్యవసాయ ఒక రోజు శిక్షణలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ రబీలో, వరి, శనగ, మినుము, పండ్ల తోటలు, ఇతర పంటలు సాగు చేస్తున్న రైతులకు, క్షేత్రస్థాయిలో పని చేస్తున్న సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. కేటాయించిన గ్రామ సంఘం స్థాయిలో టార్గెట్స్‌ను ఈ రబీ సీజన్‌లో ఎక్కువమంది రైతులు, విస్తీర్ణం ప్రకృతి వ్యవసాయంలోకి మార్చుకునేలా సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో రైతులు పాటించాల్సిన ముఖ్యమైనవి చక్రాలు బీజామృతం, ఘన, ద్రవ జీవామృతం, అచ్చాదన, వాప్స అన్నారు. గ్రామంలో రైతులు భూమి లేని నిరుపేదలకు ప్రకృతి వ్యవసాయం మొదటి చక్రం ద్వారా కొత్తగా వచ్చే రైతులకు నారు, విత్తనశుద్ధితో మొదలు పెట్టి, మార్చుకోవాలని, పెరటి తోటల పెంపకం, ప్రతి కుటుంబానికి వేయించి, కౌలు భూమి నిరుపేదలకు ఇప్పించి ప్రకృతి వ్యవసాయంలో తీసుకు రావాలన్నారు. ప్రకృతి వ్యవసాయం రైతులు, విస్తీర్ణం మోడల్ వివరాలు కచ్చితమైన సమాచారం క్షేత్ర స్థాయి సిబ్బంది దగ్గర నిర్వహించే రిజిస్టర్లో ఉండే విధంగా చూసుకోవాలని తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్, సుధారాణి, ఎస్ డిఎ ఆశీర్వాదం, ఎంసిఆర్‌పి రామ్మోహన్ రావు, ఎంసిఎ వెంకట లక్ష్మమ్మ, అరుణ, పి.ఆర్.పి కిషోర్, ఎల్-2, ఐసిఆర్‌పిలు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం

ప్రజాశక్తి- సంగంలోని బిట్ -2 ప్రాంతంలో వైద్యాధికారి శ్రీనివాసులురెడ్డి మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం మందులను పంపిణీ చేశారు. ప్రజలు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని జిల్లా వైద్యాధికారి పెంచలయ్య ఆకస్మిక తనిఖీ చేసి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.